క్లుప్తంగా

సీపీ ఆకస్మిక తనిఖీ



స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిషోర్‌ఝా

గోదావరిఖని: రామగుండం సీపీ గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. గోదావరిఖనిలోని మసీద్ ఏరియా, ప్రధాన చౌరస్తాతో పాటు రామగుండం రైల్వేస్టేషన్‌కు వెళ్లి పరిశీలించారు. సీపీ వెంట ఏసీపీ రమేశ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, రవీందర్, ఎస్సై సంధ్యారాణి ఉన్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని చందపల్లి సమీపంలోని ఈద్గా వద్ద బక్రీద్ సందర్భంగా సామూహిక ప్రార్థనలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈద్గా ఆవరణలో చెత్త, చెదారం తొలగించి పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రామగిరి: పంటల సాగులో యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని మంథని ఏడీఏ అంజని అన్నారు. మండలంలోని కల్వచర్ల, బేగంపేట, సుందిళ్ల గ్రామాల్లో గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మట్టి నమూనా సేకరణ విధానం, భూసార పరీక్షలతో కలిగే లాభాలను రైతులకు వివరించారు. పచ్చిరొట్టతో అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడంతో కలిగే లాభాలు వివరించారు. రైతులకు వానాకాలం సమాయత్తం, విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కిరణ్, వెంకన్న, ఏఈవోలు అరవింద్, మౌనిక, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ బోనాలు



కమాన్‌పూర్: మండలంలోని పిల్లిపల్లె గ్రామంలో ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పెద్దమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి పెద్దమ్మతల్లికి నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించారు.

తబితా ఆశ్రమంలో కోలేటి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న కోలేటి అభిమానులు

రామగుండం: పట్టణానికి చెందిన రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలోని తబితా ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టిన అనంతరం అన్నదానం చేశారు. కోలేటి ముఖ్య అనుచరుడు మద్ది అన్వేష్, మాజీ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, టీఆర్‌వీకేఎస్ రాష్ట్ర నాయకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

వెంకట్రావుపల్లిని ఒకే వార్డుగా ఉంచాలి

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీని ఒకే వార్డుగా ఉంచాలని వెంకట్రావుపల్లి గ్రామ నాయకులు, ప్రజలు కోరారు. రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్ల నుంచి పంచాయతీగా ఉన్న వెంకట్రావుపల్లిలో ఎన్నికలు జరగక పోవడంతో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించిందిని, వేరు 3 వార్డులను, లంబాడి తండాను కలుపుకొని ఒకే వార్డుగా ప్రకటించడంతో గందరగోళంగా మారిందన్నారు. గతంలో ఉన్న వెంకట్రావుపల్లి పంచాయతీ పరిధి కేకేనగర్, టీ2 క్వార్టర్స్, కుమారస్వామి నగర్, షిర్కె క్వార్టర్స్, కలుపుకొని 3500 మంది ఉంటారన్నారు. వాటిని ఇలానే ఉంచి ప్రత్యేక వార్డుగా గుర్తించాలని నాయకులు సదానందం, ముత్యాలగౌడ్, లక్ష్మణ్, రబ్బాని, శంకర్‌నాయక్, బీమ్లానాయక్ కోరారు.

పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వాడొద్దు



మంథని: మొక్క నాటుతున్న సీనియర్ సివిల్ జడ్జి భవాని



కోల్‌సిటీ: బట్ట సంచులు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ



సుల్తానాబాద్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి గణేశ్

కోల్‌సిటీ: పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అదనపు కలెక్టర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణశ్రీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కాలుష్య నియంత్రణ మండలి నేతృత్వంలో రామగుండం బల్దియా, సింగరేణి సంస్థ, ఎన్టీపీసీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ, జీపీపీ పీపీజీ స్వచ్ఛంద సంస్థలతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వాడకూడదన్నారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తా నుంచి శ్రీకోదండ రామాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బట్టతో తయారు చేసిన సంచులు పంపిణీ చేశారు. కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ భిక్షపతి, నగరపాలక డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, సింగరేణి అధికారి డెనిల్ కుమార్, ఆర్‌ఎఫ్‌సీఎల్ అధికారి వి.శుక్లా, ఎన్టీపీసీ అధికారి కేవీ రావు, అల్ట్రాటెక్ సిమెంట్ జీఎం ఎస్.రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వీరేశ్, కనక జ్యోతి, నగరపాలక అధికారులు కుమారస్వామి, శంకర్‌రావు, మెప్మా టీఎంసీ రజనీ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

సుల్తానాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని మున్సిఫ్ కోర్టు జడ్జి గణేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన శిబిరం నిర్వహించిన అనంతరం మొక్కలు నాటారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, ఉపాధ్యక్షుడు అవునూరు సత్యనారాయణ, లోక్ అదాలత్ మెంబర్ మాదూరి ఆంజనేయులు, ఏజీపీ దూడం ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను బతికించాలి

నాటిన ప్రతీ మొక్కను బతికించాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు.

భావితరాల కోసం మొక్కలు నాటుదాం

మంథని: భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంథని సీనియర్ సివిల్ జడ్జి వి.భవాని పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో కలిసి మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి న్యాయవాదులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రామగుండం: ప్రతీ ఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా పాటుపడాలని అంతర్గాం నాయబ్ తహసీల్దార్ ఎం.తిరుపతి కోరారు. అంతర్గాం మండల పరిధిలోని ముర్మూర్ పంచాయతీలో మొక్కలు నాటారు. రెవెన్యూ పరిశీలకులు శ్రీమాన్, కార్యదర్శి సాదుల కమల, అంగన్‌వాడీ టీచర్ పెండ్యాల విమల, కారోబార్ పీతాంబర్, విద్యాకర్‌రావు, ఏఎన్ఎంలు శిరీష, ఆశావర్కర్లు జ్యోతి ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పాలకుర్తి: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతీ ఒక్కరిపై ఉందని, ఇందుకోసం విరివిగా మొక్కలు నాటి పెంచాలని ఎంపీడీవో రామ్మోహనచారి అన్నారు. మండల పరిధిలోని జీడీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలో మండల పంచాయతీ అధికారి సుదర్శన్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యదర్శి సంజీవ్ ఉన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత

రామగిరి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి పెంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీవో శైలజారాణి అన్నారు. 'నాటుదాం ఒక మొక్క అమ్మ పేరు మీద' కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఆయా గ్రామపంచాయతీల్లో కార్యదర్శులు మొక్కలు నాటారు. ఎంపీవో ఉమేశ్, టీఏ అఖిల, సీవో సత్యం, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే కాలుష్య నియంత్రణ



పెద్దపల్లిరూరల్: అవగాహన ర్యాలీలో కమిషనర్ వెంకటేశ్, సిబ్బంది



సుల్తానాబాద్: మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ నియాజ్

పెద్దపల్లిరూరల్: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతీఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని కమిషనర్ వెంకటేశ్ అన్నారు. పట్టణ శివారు బందంపల్లిలో గురువారం ప్రభుత్వం చేపట్టిన 100రోజుల ప్రణాళికలో భాగంగా ఒక మార్పు అభివృద్ధికి మలుపు పేరిట అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మున్సిపల్ ఏఈ సతీశ్, అకౌంటెంట్ నాగవేణి, సిబ్బంది, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలలో మొక్కలు

జిల్లాలోని పీహెచ్‌సీలలో ఆసుపత్రి సిబ్బంది మొక్కలు నాటారు. ఆసుపత్రుల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఆరోగ్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

మొక్కలతో ప్రాణవాయువు

సుల్తానాబాద్: మొక్కలతో మానవాళి మనుగడకు ప్రాణవాయువు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ నియాజ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో 100రోజుల ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్, చెరువు కట్ట వద్ద 200 మొక్కలు నాటారు. మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్, మెప్మా కోఆర్డినేటర్ స్వరూప, వార్డు ఆఫీసర్లు, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీకి కనకయ్య రాజీనామా



బండారి కనకయ్య

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న బండారి కనకయ్య తన ఐఎన్టీయూసీ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు గురువారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్ర ఐఎన్టీయూసీ కార్యదర్శిగా ఎన్టీపీసీ మజ్దూర్ యూనియన్ అడ్వయిజర్‌తో పాటు పలు పదవులు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తన రాజీనామా పత్రాన్ని సెంట్రల్ ఎన్సీసీ సభ్యుడు బాబర్‌సలీంపాషా, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డికి పంపనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ ఏసీపీకి సన్మానం



సన్మానిస్తున్న శాలివాహన నాయకులు

గోదావరిఖని: రామగుండం ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన చెల్పూరి శ్రీనివాస్‌ను గురువారం సన్మానించారు. ఏసీపీ కార్యాలయానికి వెళ్లి అభినందనలు తెలియజేసి సన్మానించారు. శాలివాహన(కుమ్మరి) సంఘం జిల్లా అధ్యక్షుడు ఇజ్జగిరి భూమన్న, యూత్ అధ్యక్షుడు టీకే రాజేశ్, నిమ్మనగొట్టు రాజయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



జీపు జాతా ప్రారంభిస్తున్న ఎంఈవో రాజయ్య

సుల్తానాబాద్: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సుల్తానాబాద్ ఎంఈవో ఆరెపల్లి రాజయ్య కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతాను గురువారం జెండా ఊపి స్వాగతించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కాంపల్లి లక్ష్మణ్, సంఘం సభ్యులు జె.విష్ణు, టి.ప్రణయ్, జి.వెంకటేశ్, రామ్మోహన్, జయ, ప్రశాంత్, కేవీపీఎస్ కార్యదర్శి అశోక్, శ్రావణ్, పూర్వ విద్యార్థులు కవ్వంపల్లి దినేశ్, కార్తీక్, గుండా రమేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• నాటుసారా విక్రేతల బైండోవర్

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీ, సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన ఇద్దరు నాటుసారా విక్రేతలను గురువారం ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ రామగుండం తహసీల్దార్ దత్తుప్రసాద్ ఎదుట బైండోవర్ చేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా విక్రయించినా, తయారు చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

• ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండల పరిధిలోని బామ్లానాయక్‌తండాకు చెందిన బదావత్ గంగమ్మ-రాములు కుమార్తె అంజలి వివాహానికి గురువారం గ్రామ మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ రూ.10వేలు అందించారు.

• విద్యుత్ షాక్‌తో గేదె మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలో గురువారం విద్యుత్ షాక్ గురై కుమ్మరి నర్సయ్యకు చెందిన గేదె మృతిచెందింది. ఇంటికి సమీపంలో గల మినీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అమర్చిన సపోర్ట్ వైర్ తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందిందని బాధితుడు వాపోయాడు. గేదె విలువ దాదాపు రూ.80వేలు ఉంటుందని, ప్రభుత్వం పాడిరైతుకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

• శాంతినగర్‌ను గౌతమినగర్ డివిజన్‌లో విలీనం చేయాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ పరిధిలోని శాంతినగర్‌ను ఇటీవల విడుదల చేసిన డివిజన్‌లో విస్తరణలో 32వ డివిజన్‌లో విలీనం చేశారు. శాంతినగర్‌ను గౌతమినగర్ డివిజన్‌లో కొనసాగేలా చర్యలు చేపట్టాలని బెంద్రం రాజిరెడ్డి గురువారం మున్సిపల్ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీకి వినతి పత్రం అందించారు. స్పందించిన కమిషనర్ పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

• ఏడుగురిపై కేసు

సుల్తానాబాద్‌రూరల్: ఓ వివాహితపై గత నెల 31న దాడి చేసిన ఘటనలో బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

• ఆయిల్‌పాం సాగుపై దృష్టిసారిస్తే అధిక లాభాలు

ఎలిగేడు: రైతులు ఆయిల్‌పాం పంటపై దృష్టిసారించి సాగు చేస్తే అధిక లాభాల గడించవచ్చని హార్టికల్చర్ ఆఫీసర్ మహేశ్, ఏవో ఉమాపతి అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లోని కొత్తపల్లి ఉదయ్‌కుమార్ రావు పొలంలో గురువారం ఆయిల్ పాం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం కంపెనీ సీఈవో కేషు కళ్యాణ్, ఏఈవో గణేశ్, ఫీల్డ్ ఆఫీసర్ అభిలాష్ పాల్గొన్నారు.

• సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామగిరి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో శైలజారాణి సూచించారు. మండల వైద్యాధికారి ప్రదీప్ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రతీ మంగళవారం, శుక్రవారం డ్రైడే నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీవో ఉమేశ్, హెల్త్ అసిస్టెంట్ సీతారామయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు మహోత్సవంలో స్టాల్ ఏర్పాటుకు అవకాశం



పల్లె రాజుపటేల్

రామగుండం: సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్‌లో ఈనెల 6, 7, 8వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో రైతు మహోత్సవం-2025 కార్యక్రమం నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా వ్యవసాయం, ఉద్యానవనం, పశు సంవర్ధక, మత్స్య, వ్యవసాయ, పౌల్ట్రీ శాఖ అనుబంధ విభాగాల్లో నూతన ఆవిష్కరణలు చేసిన స్టార్టప్ కంపెనీలకు చెందిన 150 స్టాళ్లకు మహోత్సవంలో అవకాశం కల్పించారు. అంతర్గాం మండల పరిధి రాయదండికి చెందిన పల్లె రాజుపటేల్ అనే యువకుడు అగ్రి గ్రీన్ ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో స్టార్టప్ స్థాపించి వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు సృష్టించడంతో అధికారుల దృష్టిని ఆకర్షించారు. కాగా రాజుకు పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధి విభాగానికి ఒకే స్టాల్ కేటాయించారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బంధువులు

గోదావరిఖనిటౌన్: ఎన్టీపీసీకి చెందిన హర్షిత ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారవేత్త తిరకాల మల్లేశ్‌గౌడ్ నాలుగో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు గురువారం స్థానిక విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. అనాథ పిల్లలకు నెలవారీ బియ్యం, సరుకులు అందజేసి అనంతరం వారికి అన్నదానం చేశారు. మల్లేశ్‌గౌడ్ భార్య తిరకాల రాజేశ్వరి, కూతుళ్లు హర్షిత, హారిక, బంధువులు మొగిలిపాక శ్రీనివాస్‌గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు, కరణ్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలి

యైటింక్లయిన్‌కాలనీ: రానున్న వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంథని డివిజన్ పంచాయతీ అధికారి కొమ్మెర సతీశ్‌కుమార్ ఆదేశించారు. రామగిరి మండలం సుందిళ్లలో గురువారం పంచాయతీ రికార్డులతో పాటు గ్రామంలోని పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యదర్శి రమేశ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



జూలపల్లి: మండల కేంద్రంలో రజక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం శ్రీమడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. హోమం నిర్వహించి, మడేలేశ్వర స్వామితోపాటు పలు విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాజీ జెడ్పీటీసీ ప్రీతి సింగ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్, బీజేపీ సీనియర్, రాష్ట్ర నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, కోడూరి మహేశ్, రజక సంక్షేమ సంఘం అధ్యక్షుడు నగునూరి నారాయణ, ఉపాధ్యక్షుడు నగునూరి శంకరయ్య, నాయకులు నగునూరి శ్రీనివాస్, ముక్కెర శ్రీనివాస్, రాజయ్య, లక్ష్మీనారాయణ, అంజి, గంగయ్య ఉన్నారు.

సింగరేణి వార్తలు

పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత



గోదావరిఖని: బట్ట సంచులు అందిస్తున్న ఎస్‌వోటూ జీఎం రాముడు



రామగిరి: మొక్కలు నాటుతున్న జీఎం కె.నాగేశ్వరరావు

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరు బాధ్యతగా స్వీకరించాలని ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. జీఎం కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం అందరితో పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ప్రతీఒక్కరు ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. క్వాలిటీ జీఎం బైద్య, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సీఎంవోఏఐ ప్రతినిధి శ్రావణ్‌కుమార్, నాయకులు రాజు, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, ఇతర అధికారులు నాగేశ్వర్‌రావు, దాసరి కోటేశ్వర్‌రావు, ఆంజనేయులు, కుమారస్వామి, జితేందర్‌సింగ్, సాయిప్రసాద్, ధనలక్ష్మిబాయి, బీమా, వరప్రసాద్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం అంతం చేయాలి

గోదావరిఖని: మానవాళి మనుగడకు ముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని పూర్తిగా అంతం చేయాలని ఆర్జీ-2 ఎస్‌వోటూ జీఎం రాముడు పిలుపునిచ్చారు. ఆర్జీ-2 జీఎం కార్యాలయంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బట్ట సంచులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఏటా తెలంగాణకు హరితహారం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ లక్షలాది మొక్కలు నాటుతోందన్నారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతి అందజేశారు. అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, పర్సనల్ డీజీఎం అనిల్‌కుమార్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఫైనాన్స్ డీజీఎం వెంకటరామచంద్ర, సర్వే అధికారి ఉజ్వల్ బదోపాధ్యాయ, ఎస్టేట్ అధికారి సునీత, ఏరియా సెక్యూరిటీ అధికారి మహమ్మద్ పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం..

రామగిరి: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఆర్జీ-3 జీఎం కొలిపాక నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లోని గనులు, జీఎం కార్యాలయంలో మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణ అధికారి రాజారెడ్డి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రాతినిధ్య సంఘం నాయకులు కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం ప్రతినిధి శ్రీకాంత్, ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఎస్‌వోటూ జీఎంలు రాంమోహన్, సత్యనారాయణ, అధికారులు కళ్యాణ్, భానుప్రసాద్, సుదర్శనం, జనార్దన్‌రెడ్డి, ఐలయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి



వ్యూ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు

రామగిరి: ఓబీ రోజువారి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి బొగ్గుఉత్పత్తికి ఆటంకం కలగకుండా చూసుకోవాలని ఈఅండ్ఎం డైరెక్టర్ డి.సత్యనారాయణరావు అన్నారు. ఆర్జీ-3 ఏరియా ఓసీపీ-2గనిలో గురువారం ఆయన పర్యటించారు. వ్యూపాయింట్ నుంచి క్వారీలో నడుస్తున్న పనులను పరిశీలించారు. అనంతరం యంత్రాల వినియోగంతో పాటు, నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి తీసుకుంటున్న భద్రత చర్యలు, రూపొందించిన ప్రణాళికల వివరాలను ఆర్జీ-3 జీఎం కొలిపాక నాగేశ్వరరావు వివరించారు. భద్రతతో కూడిన ఉత్పత్తి, రవాణా సాధించడానికి ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. ఏరియా ఇంజనీర్ వై.వి.శేఖర్‌బాబు, ఎస్‌వోటూ జీఎం ఎం.రాంమోహన్, ప్రాజెక్టు ఇంజనీర్ ఎంపీఎస్‌ఏ. చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామరావు, అధికారులు పులి మహేందర్, తేజ, షబ్బీరుద్దీన్ ఉన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న చిలుక శంకర్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్‌లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు సంబంధిత కాంట్రాక్టర్ పరిష్కరించేలా యాజమాన్యం చొరవ తీసుకోవాలని కాంట్రాక్టు కార్మికుల సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ డిమాండ్ చేశారు. పర్మినెంట్ టౌన్‌షిప్ ఏ గేట్ వద్ద కార్మికులు గురువారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 2022 ఒప్పందం ప్రకారం ప్రతీ కార్మికుడికి రూ.1,020 చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న 16నెలల అలవెన్సులు వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం స్పందించి చర్చలకు ఆహ్వానించడం శుభపరిణామం అన్నారు. చర్చల అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని తెలియజేయడంతో కార్మికులు నిరసన విరమించి విధులకు హాజరయ్యారు. రవి, రమేశ్, సుధాకర్, రాధ, సరోజన, రాయమల్లమ్మ, ఓదెమ్మ, చిరంజీవి, కృష్ణ పాల్గొన్నారు.

ఎన్‌సీఓఏ క్లబ్ సెక్రటరీగా సంతోష్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-2 ఎన్‌సీఓఏ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. క్లబ్ సెక్రటరీ ఎస్.సంతోష్‌కుమార్ (ఏరియా సేఫ్టీ అధికారి), జూనియర్ సెక్రటరీ ఎస్.ఈశ్వర్‌రెడ్డి(డీవైఎస్ఈ), కోశాధికారి మురళీకృష్ణ (ఐఈడీ డీజీఎం), కల్చరల్ సెక్రటరీ ఎం.జనార్దన్ (బేస్‌వర్క్‌షాప్, ఎస్ఈ), స్పోర్ట్స్ సెక్రటరీ ఎ.నర్సింహమూర్తి(డీవైఎస్ఈ, ఎంఆర్ఎస్), లేడీస్ రిప్రజంటేటివ్ ఎం.అశ్విని(ఐటీ మేనేజ్‌మెంట్ ట్రైనీ)లను ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

భూభారతితోనే సత్వర పరిష్కారం



వినతిపత్రం అందజేస్తున్న రైతు

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్‌తోనే భూసమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని అంతర్గాం, రామగుండం తహసీల్దార్లు తూం రవీందర్‌పటేల్, దత్తుప్రసాద్ అన్నారు. అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లి, రామగుండం కార్పొరేషన్ పరిధిలోని అబాది రామగుండం గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్లు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రతినిధులు ఈదునూరి హరిప్రసాద్, గాదె సుధాకర్, రెవెన్యూ పరిశీలకులు గుంట రమేశ్, ఈశ్వర్, కోటేశ్వర్‌రావు, శ్రీవాణి, చంద్రశేఖర్, సంపత్, కార్యదర్శి పాల్గొన్నారు.

జూలపల్లి: మండలంలోని తేలుకుంట, కుమ్మరికుంట గ్రామాల్లో మూడోరోజు భూభారతి రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. కాచాపూర్‌లో నాయబ్ తహసీల్దారు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో భూసమస్యలపై 34 దరఖాస్తులు రాగా, తేలుకుంటలో తహసీల్దారు స్వర్ణ 406 దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐలు భవానీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

ముత్తారం: మండలంలోని అడవి శ్రీరాంపూర్, పోతారంలో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రెండు గ్రామాల్లో 83 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

పాలకుర్తి: మండల పరిధిలోని గుడిపల్లి, రాణాపూర్ గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ సునీత, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరరావుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రాణాపూర్‌లో 26, గుడిపల్లిలో 22 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఓదెల: మండలంలోని కొలనూర్ రైతువేదికలో భూభారతి రెవెన్యూ సదస్సు గురువారం జరిగింది. ఈ సదస్సులో గోపరపల్లె, ఉప్పరపల్లె, హరిపురం, కొలనూర్ గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్‌కు దరఖాస్తులు సమర్పించారు. తహసీల్దార్ ధీరజ్‌కుమార్, ఆర్ఐ గౌతం పాల్గొన్నారు.